పోలింగ్ బూత్‌ల పరిశీలన

హఫీజ్‌పేట్ పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్వో, జెడ్పీ శ్రీనివాస్‌రెడ్డి

మాదాపూర్, అక్టోబర్ 21 : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను శనివారం ఆర్వో, జెడ్పీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బూత్‌ల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా అధికారులు సన్నద్ధంగా ఉన్నారని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆయన విలేకరులకు న్నారు. ఓటర్లు సైతం గుర్తింపు పొందిన దృవీకరణ పత్రాలతోపాటు ఓటరు కార్డుతో పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిందిగా సూచించారు. ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

• మరోసారి అరెకపూడి గాంధీని గెలిపిద్దాం • ఎమ్మెల్యే సతీమణి శ్యామలాదేవి

చందానగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సతీమణి శ్యామలాదేవి, కార్పొరేటర్ మంజులరెడ్డి, బీఆర్ఎస్ మహిళా నేతలు

కొండాపూర్, అక్టోబర్ 21 : బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడే నాయకుడు అరెకపూడిగాంధీని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని గాంధీ సతీమణి శ్యామలాదేవి ప్రజలను కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ లాదేవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కారు గుర్తుకు ఓటేసి గాంధీని గెలిపించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా అందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడ్ల ధనలక్ష్మి, చంద్రిక ప్రసాద్, వరలక్ష్మి, మాధవి, పృథ్వీ, రాధిక, ప్రణీత, భవాని, కుమార్, సునీత, రజిని, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం అరెకపూడిని గెలిపించుకుందాం..

చక్రధర్ కాలనీవాసులతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

మియాపూర్, అక్టోబరు 21 : కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధిని ముమ్ముందూ కొనసాగించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇప్పటికే డివిజన్‌లో రూ. 100 కోట్లకు పైగా నిధులను వెచ్చించి అనేక మౌలిక వసతులను కల్పించారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డివిజన్‌లోని చక్రధర్ కాలనీ వాసులతో కార్పొరేటర్ దొడ్ల శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విప్ గాంధీ సేవలందించారని అన్నారు. నియోజకవర్గాన్ని సమున్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి అధిక మెజార్టీతో గెలిపించుకుందామని కార్పొరేటర్ పేర్కొన్నారు. యువజన నాయకుడు దొడ్ల రామకృష్ణ గౌడ్, కాలనీ ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

*మియాపూర్ కల్పవరి టెంపుల్ హాస్పటల్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఫేజ్-2 లాస్ట్ బస్టాప్ వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చాంద్‌పాషాకు భారత ఉత్తమ మానవతావాది అవార్డు

చాంద్‌పాషా

కొండాపూర్, అక్టోబర్ 21 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిరుపేదలకు చేస్తున్న సేవలను గుర్తించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ 'భారత ఉత్తమ మానవతావాది' అవార్డును అందజేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చాంద్‌పాషా మాట్లాడుతూ... నిస్వార్థంగా 10 సంవత్సరాలుగా పేదలకు అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ అవార్డును అందించడం సంతోషంగా ఉందన్నారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడిగా సేవలందిస్తూనే నిరుపేదలకు తమ వంతుగా సాయం చేస్తున్నట్లు తెలిపారు. అవార్డు ఎంపికలో సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎన్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

భరతనాట్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 21 : శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా శారీ మేళా, బతుకమ్మ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. శనివారం పలువురు కళాకారులు భరతనాట్య నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. బెనాక నాట్య మందిర్ గురువులు రేఖ దినేశ్, వైష్ణవి నాట్య సెంటర్ గురువులు వైష్ణవి సాయినాథ్‌ల శిష్య బృందాలు మైసూర్ జాతి, ముదాకర, శృంగారపుర, అష్టలక్ష్మి, దుర్గే దుర్గే, కంజదళయాదాక్షి, వాళ్లచి తిల్లాన,పుష్పాంజలి, భోశంభో, స్వాగతం కృష్ణ, అలరిపు, శారదాకౌతం, మీరా భజన, దుర్గ స్తుతి, మహాలక్ష్మీస్తుతి, కళింగ నర్తనం అంశాలను భరతనాట్య రూపకంలో నర్తించిన తీరు సందర్శకులను ఆకట్టుకుంది.

దుర్గామాత పూజల్లో ప్రభుత్వ విప్

దుర్గా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మియాపూర్ డివిజన్ పరిధి న్యూకాలనీ, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో నిర్వహించిన దుర్గామాత పూజల్లో శనివారం ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నిర్వాహకులు, స్థానికులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

– మియాపూర్ , అక్టోబరు 21

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కొండాపూర్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గామాత పూజల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ నీలం రవిందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

– కొండాపూర్, అక్టోబర్ 21

బొటానికల్ గార్డెన్స్‌లో బతుకమ్మ వేడుకలు

కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్స్‌లో టీఎస్ఎఫ్‌డీసీ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో మహిళా వాకర్స్ బతుకమ్మలు పేర్చి ఉత్సాహంగా ఆడిపాడారు. మహిళా వాకర్స్ పెద్ద సంఖ్యలో హాజరై సందడిగా బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. – శేరిలింగంపల్లి, అక్టోబర్ 21

ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రచయిత, ఆర్టిస్ట్ అంజు పొద్దర్, చిత్రకారిణి సబితాలక్ష్మణన్ తదితరులు

కొండాపూర్, అక్టోబర్ 21: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారిణి సబితాలక్ష్మణన్ ఏర్పాటు చేసిన 'ఇట్ ఈజ్ నాట్ జస్ట్ సోలో పెయింటింగ్' ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ప్రముఖ రచయిత, ఆర్టిస్ట్ అంజు పొద్దర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను తిలకించి, వాటి వివరాలను చిత్రకారిణి సబితను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనలో 38 చిత్రాలను ఉంచామని, 29 వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ డాఫ్నె డేరిబెల్లో, రత్నరావు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.